ఘననాథులు

చవితికి విభిన్న రూపాల్లో ముస్తాబు ● మట్టి ప్రతిమలకు డిమాండ్ ● కళాకారులకు చేతినిండా ఉపాధి



రంగులు దిద్దుకోవడానికి సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు



పెదగంట్యాడ: వినాయక చవితి సందడి మొదలైంది. ఇప్పటికే ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆది దేవునికి తొలి పూజ చేసేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. ప్రతి ఇంటితో పాటు వీధివీధినా గణనాథుని ఉత్సవాలు చేసేందుకు ఆయా కమిటీలు ఇప్పటికే ప్రణాళికలు రచించాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది ఘనంగా ఉత్సవాలు చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.. ఇదంతా ఒకఎత్తయితే.. ఉత్సవాలకు ప్రతిమలు తయారు చేయడం మరో ఎత్తు. ఇప్పటికే మండలంలో హౌసింగ్ బోర్డు కాలనీ, సమతానగర్, దయాల్‌నగర్, బాపూజీ కాలనీ తదితర ప్రాంతాల్లో వినాయకుని ప్రతిమలు తయారు చేస్తున్నారు. రాత్రీ పగలూ తేడా లేకుండా పని చేస్తున్నారు.

కోల్‌కతా నుంచి బంక మట్టి తెచ్చి..

వినాయకుడి ప్రతిమలను విభిన్న రూపాల్లో తయారు చేస్తున్న కళాకారులు దానికి అవసరమైన సరంజామాను సిద్ధం చేసుకున్నారు. ముందుగా కర్రలు, గడ్డితో ఒక ఆకారాన్ని రూపుదిద్దుతున్నారు. అనంతరం మట్టితో అద్ది ఆ ఆకారానికి ఒక రూపం తీసుకువస్తున్నారు. దీనికి అవసరమైన బంక మట్టిని కోల్‌కతా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. బొమ్మలను పూర్తి స్థాయిలో తీర్చి దిద్దిన అనంతరం వాటికి రంగులు వేస్తారు. గజముఖిడిని విభిన్న రూపాల్లో తయారు చేస్తూ ఆకట్టుకుంటున్నారు..



కోల్‌కతా నుంచి వచ్చా

"తాతల కాలం నుంచి ఇదే వృత్తిలో ఉంటున్నాం. వినాయక చవితి ఉత్సవాల తర్వాత మళ్లీ కోల్‌కతావెళ్లిపోతాం. నాతోపాటు 22 మంది వచ్చారు. 4 నెలల పాటు ఇక్కడ పని చేస్తే సుమారు రూ.లక్ష వరకూ వస్తుంది." –శుభజిత్‌పాల్, కోల్‌కతా

స్థిరపడిన కళాకారులు

30 ఏళ్ల కిందట కోల్‌కతా నుంచి వచ్చిన కళాకారుల కుటుంబాల ఇక్కడి స్థిరపడిపోయాయి. కొంతమంది 4నెలలు ముందు వచ్చి ప్రతిమల తయారీలో నిమగ్నమవుతున్నారు. వినాయకుని ఉత్సవాలతో పాటు దసరా పండగకు సంబంధించి దుర్గాదేవి విగ్రహాలను తయారు చేస్తుంటారు. అలాగే విశ్వకర్మ పూజలకు కూడా ఇక్కడ ప్రతిమలు సిద్ధం చేస్తారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణానికి మేలు ..

పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలు ఎంతో మేలు చేస్తాయని నిపుణులు, పెద్దలు అంటున్నారు. మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని శాస్త్రంతో పాటు పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. అందుకు తగ్గట్టుగా ఇప్పటికే మట్టిప్రతిమలకు భారీగా ఆర్డర్లు వచ్చాయి.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ముప్పు

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వల్ల పర్యావరణ పరంగానే కాకుండా తాగు నీరు కలుషితమవుతుంది. దీని పర్యవసానాలు మరిన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా మనకు కనబడుతున్నాయి. ఈ క్రమంలో మట్టి ప్రతమలు, సహజ రంగులతో ఉన్న గణనాథులనే పూజించాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.





30 ఏళ్లుగా తయారీ..

మండలంలో హౌసింగ్‌బోర్డు కాలనీలో, సమతానగర్ ప్రాంతంలో కోల్‌కతా నుంచి వచ్చిన కళాకారులు ఇక్కడ 30 ఏళ్లగా మట్టి ప్రతిమలు తయారు చేస్తూ జీవనాధరంగా బతుకుతున్నారు. వినాయక చవితికి సుమారు 5 నెలలు ముందుగానే సిద్ధం అయ్యారు. గణపతి ప్రతిమలు తయారు చేయడం ప్రారంభించారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అగనంపూడి: దువ్వాడ వీఎస్ఈజెడ్ 33 కేవీ సబ్‌స్టేషన్ పీటీఆర్ లైన్‌లో జంగిల్ క్లియరెన్స్ కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. అగనంపూడి సెక్షన్ కార్యాలయం పరిధిలోని అగనంపూడి, దువ్వాడ సెక్టార్–2, యాతపాలెం, లక్కరాజు పాలెం, శివాజీనగర్, గళ్లవానిపాలెం, పాత అగనంపూడి, జాబిలీహిల్స్, శనివాడ, మంగళపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, దువ్వాడ సెక్టార్–1, వెదుళ్లనరవ, గంగవరం, శెట్టివానిపాలెం, లంకెలవానిపాలెం, అజనగిరి ప్రాంతాలకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

పెదగంట్యాడ: 11కేవీ రామచంద్రనగర్, 11కేవీ టింపనీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 4, 5 తేదీల్లో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రనగర్ ఫీడర్ పరిధిలో అమరావతి పార్కు, భరత్‌నగర్, గోపాల్‌రెడ్డినగర్, టింపనీ ఫీడర్ పరిధిలో అమరావతి పార్కు ఏరియా తదితర ప్రాంతాల్లో సోమవారం, మంగళవారం రెండురోజులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలపై అవగాహన

అగనంపూడి: విదేశీ విశ్వ విద్యాలయాల్లో ప్రవేశాలు సులభంగా పొందడం, ప్రాముఖ్యత ఉన్న విశ్వ విద్యాలయాల్లో ప్రవేశాలు, ఫీజుల వివరాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అమెరికా, కెనడాలోని పలు యూనివర్సిటీల్లో కోర్సులు, అర్హతలు, ప్రవేశాలు, ఫీజు వివరాలు, స్కాలర్‌షిప్‌లు తదితర అంశాలను విద్యార్థులకు ఏఈసీసీ గ్లోబల్ సంస్థ ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదన రావు, కోఆర్డినేటర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: భరత జాతి గొప్పదనానికి ప్రతీకగా నిలిచిన జాతీయ పతాకాన్ని రూపొందించి తెలుగు జాతి కీర్తిని ఇనుమడింపజేసిన పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. అగనంపూడి కూడలిలో మహాత్మాగాంధీ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకమంలో వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, వివిధ సంఘాల నాయకులు కోసూరి తాతారావు, మేడిశెట్టి శ్రీను, రాము, నగరాల అప్పారావు, చింతల అప్పారావు, హరి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలతో రాఖీల తయారీ



తయారు చేసిన రాఖీలతో విద్యార్థులు

గాజువాక: రాఖీ పండగను పురస్కరించుకొని స్థానిక భాస్కర్ విద్యానికేతన్‌లో విద్యార్థులకు విత్తనాలతో రాఖీల తయారీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 7, 8, 9 తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ రక్షా బంధన్ విశిష్టతను వివరించారు. కరస్పాండెంట్ రమాదేవి, ఉపాధ్యాయులు శిరీష, సునీత పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం జరిపించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

మమ్మల్ని రోడ్డున పడేశారు

మంత్రి డోలా ముందు బాధితుల మొర



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

గాజువాక: గాంధీనగర్‌లో గెడ్డకు ఆనుకొని ఉన్న దుకాణాలను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించడంపై బాధితులు మంత్రి డోలా వీరాంజనేయస్వామి ముందు కన్నీటిపర్యంతమయ్యారు. అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు సాయం విడుదల చేయడానికి మంత్రి గాజువాక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారన్న విషయం తెలుసుకున్న బాధితులు హుటాహుటిన ఇక్కడికి వచ్చారు. మంత్రికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. 30 ఏళ్లుగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొంటున్నామని, కార్పొరేటర్ ప్రోద్బలంతో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు తమ దుకాణాలు తొలగించారని మంత్రికి వివరించారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ దుకాణాలన్నీ గెడ్డను ఆనుకొని ఉన్నాయని, వాటిని తొలగించాలని కోర్టు ఆర్డర్ ఉండడంతో తొలగించారని చెప్పుకొచ్చారు. అయితే, తొలగించే ముందు తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వలేదని వాపోయారు. నోటీసులు ఎందుకివ్వలేదో తాను తెలుసుకుంటానని కలెక్టర్ పేర్కొన్నారు. కాగా, తమ దుకాణాల సందర్శనకు రావాలని బాధితులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కోరారు. ఆయన వస్తానని చెబుతుండగా కల్పించుకున్న ఒక బాధితుడు తాము ఓట్లేసి గెలిపించామని, ఇప్పుడు తమను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొనడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నువ్వొక్కడివే ఓటేస్తే నేను గెలిచానా?' అంటూ మండిపడ్డారు. ఈ విషయం మొత్తం విన్న మంత్రి డోలా వారికి ఎలాంటి హామీ ఇవ్వకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో చైన్ స్నాచింగ్



చైన్ స్నాచింగ్‌కు గురైన మహిళ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని సెక్టార్–12లో శనివారం ఉదయం మహిళ మెడ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారం చైన్ లాక్కుని పారిపోయారు. వివరాలిలా .. 163బి క్వార్టర్‌లో నివాసముంటున్న కర్రి ఉమాదేవి ఉదయం ఆ సెక్టార్‌లో వాకింగ్ చేస్తున్నారు. స్కూటీపై వచ్చిన ఇద్దరు యువకులు వచ్చి ఆమె మెడలోని రెండు వరుసల చైన్‌ను తెంపేందుకు ప్రయత్నించారు. దీంతో ఆమె గట్టిగా ప్రతిఘటించడంతో సుమారు రెండు తులాల బరువు కలిగిన సగం చైన్ దుండగుల చేతికి చిక్కింది. మిగిలినది ఆమె చేతిలో మిగిలింది. ఆమె అరవడంతో దుండగులు స్కూటీపై పారిపోయారు. బాధితురాలు స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

హయ్యర్ పెన్షన్ అమలు చేయాల్సిందే..



ధర్నాలో ప్రసంగిస్తున్న జీటీపీ ప్రకాష్

గాజువాక: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం భెల్ కార్మికులకు హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంస్థ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో భెల్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఇతర పరిశ్రమలకు సంబంధించిన పలు సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా భెల్ సీఐటీయూ నాయకుడు జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఈపీఎఫ్–95 హయ్యర్ పెన్షన్‌ను ఇతర యూనిట్లలో అమలు చేస్తున్నారన్నారు. ఇక్కడ యాజమాన్యం, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేస్తున్నాయన్నారు. వివిధ సీరీస్‌లకు చెందిన కార్మికుల జాయింగ్ తేదీలను సరి చేసి హయ్యర్ పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పీఎఫ్ ట్రస్టు కూడా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులకు న్యాయం చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఐఎన్‌టీయూసీ నాయకుడు సీతన్న నాయుడు మాట్లాడుతూ కార్మికులను కంపెనీ యాజమాన్యం, ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నాయని అన్నారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నాయకుడు ఎస్.రామారావు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారా హయ్యర్ పెన్షన్ సాధించామన్నారు. ఇక్కడ హయ్యర్ పెన్షన్‌ను అమలు చేయకపోవడం కార్మిక వ్యతిరేక చర్య అన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన కార్మిక నాయకులు ఎస్.ప్రసాద్, దీనబంధు, ఎస్.జగన్నాథరావు, అల్లం వెంకటేశ్వరరావు, ఎస్.అప్పలరాజు, యుఎంకే ఆచారి, ఎస్.సహబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో మృతదేహం

దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ముళ్లపొదల్లో లభ్యమైన మృతదేహం

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ముళ్ల పొదల్లో మృతదేహం లభ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.రాజీవ్ నగర్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి పక్కన గల తుప్పల్లో ఓ వ్యక్తి చనిపోయి ఉన్నట్టు దువ్వాడ సెక్టార్ –1 సచివాలయానికి సమాచారం వచ్చింది. దీంతో వీఆర్వో మడక పరమేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి పేరు మనోజ్ అని, 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని వీఆర్వో ఫిర్యాదులో పేర్కొన్నారు. 20 ఏళ్లుగా రాజీవ్‌నగర్ ప్రాంతంలో భిక్షాటన, చిత్తు కాగితాలు ఏరుకొంటూ జీవనం సాగిస్తున్నాడని ఆయన వివరించారు. అలాగే ఆయన ఒరియా మాట్లాడుతుంటాడని స్థానికులు తెలిపారని ఫిర్యాదులో పొందుపరిచారు. అయితే మృతుడి ముఖం, వీపు పైన గాయాలు ఉండడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు. కాగా మృతుడి ఒంటిపై గాయాలు ఉండడంతో హత్య అయి ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యంగా తిరిగే ఆ వ్యక్తి అకస్మాత్తుగా తుప్పల్లో ఎలా లభ్యమయ్యాడన్న విషయం ఎవరికీ అంతుపట్టడం లేదు. పోలీసులు ఆ కోణంలోదర్యాప్తు సాగిస్తున్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి ఎంపిక కోసం దరఖాస్తు గడువును ఈనెల 5వ తేదీ వరకు పొడిగించినట్టు అనకాపల్లి డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు జిల్లా కార్యదర్శి ఎంపిక కోసం దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నామని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు...

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో పనిచేసే (ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ మినహా) అర్హత కలిగిన ఉపాధ్యాయులు యలమంచిలిఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. అలాగే ఫెలో టీచర్ అవార్డు విభాగంలో దరఖాస్తు చేసేవారు మరో ఐదుగురు సంబంధిత ఉపాధ్యాయుడికి ఆధారాలు సమర్పిస్తూ దరఖాస్తు పంపించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వివరాల కోసం డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

రాఖీల తయారీపై వర్క్‌షాపు



రాకీలు, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ల తయారీపై అవగాహన కల్పిస్తున్న అతిథులు

అగనంపూడి: రాఖీ పౌర్ణమి, స్నేహితుల దినోత్సవం సందర్భంగా రాఖీలు తయారు చేసే విధానంపై ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్ కౌన్సిల్, విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించాయి. రాష్ట్ర క్రాఫ్ట్ కౌన్సిల్ ప్రతినిధి ఉమాబాల మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా చేయడం, సృజనాత్మకతను పెంపొందించడం కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల్లో హస్తకళలు ఒక భాగమని.. వాటిని ప్రోత్సహించే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో క్రైస్తవ నాయకుల సదస్సు

తాటిచెట్లపాలెం: కైలాసపురం డౌన్‌లోని గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్‌లో శనివారం క్రిస్టియన్ లీడర్స్ కాన్ఫరెన్స్ పోస్టర్‌ను కార్యవర్గ సభ్యులతో కలిసి డాక్టర్ గరికిముక్కుల పాల్ విక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 22, 23, 24 తేదీల్లో గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్‌లో జాతీయ క్రైస్తవ నాయకుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశంలో క్రైస్తవులు, సంఘాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, జీవోలు, క్రైస్తవుల హక్కులు, ప్రాధాన్యతల గురించి చర్చిస్తారన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి తెలియజేస్తారని చెప్పారు.

సిరులతల్లికి శ్రావణలక్ష్మి పూజలు



పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న శ్రీలక్ష్మి పూజలు శుక్రవారం 9వ రోజుకు చేరాయి. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసి పూజ..

సిరులతల్లికి శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఈవో శోభారాణి తెలిపారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే పోరు తప్పదు

- వామపక్ష పార్టీల హెచ్చరిక
- అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఏడీఈ కార్యాలయంవద్ద ధర్నా



ధర్నాలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

గాజువాక: విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగిస్తే పోరాటం తప్పదని సీపీఎం, సీపీఐ నాయకులు హెచ్చరించారు. అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ గాజువాక ఏడీఈ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగిస్తే పేద, మధ్యతరగతి వర్గాలపై పెనుభారం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలతో ప్రజలు ఇప్పటికే సతమతమవుతున్నారన్నారు. కొత్తగా స్మార్ట్ మీటర్లు బిగించడమంటే ప్రజల గొంతు నొక్కడమేనన్నారు. విద్యుత్ సిబ్బంది తీస్తున్న బిల్లులను ప్రజలు ప్రతినెలా సక్రమంగా చెల్లిస్తున్నారని, ఎటువంటి ఆటంకం లేని ఈ ప్రక్రియను రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అదానీ ప్రయోజనాలకనుగుణంగా మారుస్తోందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత బిగించడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. ఈ దుర్మార్గాన్ని ప్రజలు అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్, త్రినాథ్‌స్వామి, కె.కిరీటం, కె.సంతోషం, శ్రీదేవి, జి.రాము, జె.కోటేశ్వరరావు, వరి వెంకటరావు, అచ్యుతరావు, దుర్గారావు, వనజాక్షి, పిల్లా పద్మ తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



గంట్యాడ గురుమూర్తిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి

పెదగంట్యాడ: ఏ వ్యక్తికైనా వారి జీవితంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన గంట్యాడ గురుమూర్తిని శనివారం పెదగంట్యాడ జంక్షన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుమూర్తి శేష జీవితం హాయిగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయ కర్త తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, రోజారాణి, కొయ్య భారతి, గొందేశి మహేశ్వరరెడ్డి, నక్క వెంకటరమణ, గంట్యాడ పైడిరాజు, అండిబోయిన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలలో రోగ నిరోధక శక్తి అధికం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు

అగనంపూడి: తల్లిపాలల్లో రోగ నిరోధక శక్తి ఉంటుందని, బాలింతలు ఈవిషయంలో తగిన శ్రద్ధతీసుకొని డబ్బా పాలకు దూరం పెట్టాలని విప్రో కేర్ కుషాల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ చెల్లాయమ్మ అన్నారు. ఐసీడీఎస్, విప్రో కేర్ కుషాల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం కొండయ్యవలస అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువుకు సరైన పోషణ అంటే తల్లిపాలే అన్నారు. తల్లిపాలు బిడ్డలకు అమృతం వలే పనిచేస్తాయన్నారు. ఈ సందర్భంగా తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఉత్సాహంగా బృందగాన పోటీలు



పోటీల న్యాయనిర్ణేతలను సత్కరిస్తున్న ప్రజానాట్యమండలి ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బృందగాన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. దేశభక్తిని చాటుదాం అనే అంశంపై స్టీల్‌క్లబ్‌లో నిర్వహించిన పోటీల్లో స్టీల్‌ప్లాంట్ పరిధిలోని పాఠశాలలతో పాటు అగనంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్, గ్లోరీ విద్యాకేంద్రం, విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్, గ్రీన్ సిటీ స్కూల్ తదితర 14 పాఠశాలల నుంచి 150 విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు, హిందీ భాషల్లో ఆలపించి ఆహుతులను ఆకట్టుకున్నారు. కొర్లాం శ్రీనివాస్, యు.వి. రమణ, వై. తేజస్విలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి. దాస్, వై. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.